అక్రమంగా కొండను తవ్వేస్తున్నారు..!

- ఆర్డీవో కార్యాలయానికి కూతవేటు దూరంలో తవ్వకాలు
- సమీపంలోని ఇళ్లకు పొంచి ఉన్న ముప్పు
- స్పందించని రెవెన్యూ అధికారులు


నేరెళ్లవలసల కాలనీలో ఇళ్లను ఆనుకుని కొండను తవ్వుతున్న దృశ్యం

తగరపువలస: భీమిలి ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాలకు కూతవేటు దూరంలోని నేరెళ్లవలస కాలనీలో పట్టపగలే అక్రమార్కులు జేసీబీ ఉపయోగించి కొండను తవ్వేస్తున్నారు. ఇప్పటికే ఇక్కడ ఆక్రమిత ప్రదేశాల్లో భారీ భవంతులు కట్టిన యజమానులు, అవి చాలవన్నట్టు ఇంకా కొండపైకి తవ్వుకుంటూ వెళ్లిపోతున్నారు. దీంతో సమీపంలో ఉన్న ఇళ్లకు ప్రమాదం పొంచి ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల రెండు రోజుల వ్యవధిలో కొండను చదును చేసి 200 లారీల గ్రావెల్, బండరాళ్లను తరలించినట్టు స్థానికులు చెబుతున్నారు. కొండవాలు ప్రాంతంలో చుట్టూ నివాస గృహాలు ఉన్న సమయంలో జేసీబీతో గ్రావెల్ తవ్వకాలు, లారీలతో తరలింపు వల్ల ప్రమాదాలు జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని ఆందోళన చెందుతున్నారు. ఈ వాలు ప్రాంతంలో రక్షణ గోడలు లేనందున అక్రమ తవ్వకాల వల్ల కొండపై నుంచి ప్రవహించే వర్షం నీరు కారణంగా భవిష్యత్తులో పక్కనే ఉన్న భవనాల కింద కోతకు గురయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ఈ ప్రాంతంలో కొండలు, ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి చదును చేసి లక్షలాది రూపాయలకు విక్రయిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. భీమిలి ఆర్డీవో కార్యాలయానికి 500 మీటర్ల దూరంలో ఈ తతంగం యథేచ్ఛగా జరుగుతున్నా స్థానికంగా ఉన్న వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, వీఆర్వోలు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారు. దీంతో ఈ ప్రాంతంలో రోజురోజుకూ ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురవుతున్నాయి. వీరికి తెర వెనుక కొందరు పెద్దల సహకారం ఉండడంతో స్థానికుల అభ్యంతరాలు పట్టించుకోవడం లేదు. నేరెళ్లవలసలో అక్రమ తవ్వకాల విషయాన్ని భీమిలి తహసీల్దార్ కోరాడ వేణుగోపాల్ దృష్టికి తీసుకురాగా వీఆర్వోను పంపించి పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామన్నారు.


కొండ తవ్వడానికి తీసుకొచ్చిన జేసీబీ

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక


వేములవలసలో సమావేశమైన 1992 - 93 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు


బోని సాయికి నగదు అందిస్తున్న విజయకుమారి

తగరపువలస: ఆనందపురం జెడ్పీ హైస్కూల్‌లో 1992 – 93 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం వేములవలస బీపీ కళ్లాలు రోడ్డులోని శుభశ్రీ ఫంక్షన్ హాలులో ఆత్మీయ సమావేశం నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా 30 ఏళ్ల కిందటి జ్ఞాపకాలు నెమరు వేసుకున్నారు. యోగక్షేమాలు, కష్టసుఖాలు తెలుసుకుని భవిష్యత్తులో చేపట్టబోయే సేవా కార్యక్రమాలపై చర్చించారు. తోటి స్నేహితులకు ఎలాంటి సమస్య వచ్చినా ఆదుకోవాలని నిర్ణయించారు. సమావేశంలో పూర్వ విద్యార్థులలో ప్రస్తుత ఉపాధ్యాయుడు పతివాడ రమణ, ఎస్ఐ బోరపు మంగరాజు, మీసాల రామానాయుడు, దొంతల శ్రీను, విజినిగిరి అప్పలనాయుడు, కంది సత్తిబాబు, కృష్ణవేణి, బంగారునాయుడు, ఉప్పాడ సీతారాం, గొల్లు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

భీమునిపట్నం: స్థానిక సీబీఎం ఎయిడెడ్ ఉన్నత పాఠశాల 2008 – 09 సంవత్సరానికి చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు ఒకరిని ఒకరు ఆప్యాయంగా పలకరించుకుని యోగ క్షేమాలు తెలుసుకున్నారు. ప్రస్తుతం ఎవరు ఎక్కడ ఉన్నారు, కుటుంబ సభ్యుల వివరాలు తెలుసుకుని సరదాగా గడిపారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ పి.విజయకుమారి మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు ఇలా కలుసుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఇక్కడ ఉపాధ్యాయుల కొరత ఉందని, పరిష్కారానికి అవకాశం ఉన్న మేరకు సహకరించాలని కోరారు. అనంతరం ఇటీవల పదో తరగతిలో 575 మార్కులు సాధించిన భీమిలికి చెందిన బోని సాయిని అభినందించి పాఠశాల యాజమాన్యం రూ.5 వేలు అందించింది.

సంతకు ఎండ ఎఫెక్ట్


బోసిపోయిన ప్రైవేట్ మార్కెట్ ప్రధాన రహదారి

తగరపువలస: మండుతున్న ఎండల వల్ల స్థానిక ప్రైవేట్ మార్కెట్‌లో ఆదివారం సంత బోసిపోయింది. వాస్తవంగా సాధారణ రోజుల్లో మార్కెట్ కంటే ఆదివారం సంత జరిగే సమయంలో అయిదురెట్లు వ్యాపారులు, వినియోగదారులు వస్తుంటారు. మిగిలిన రోజులకంటే సంత రోజుల్లో ఇక్కడి మార్కెట్‌లో వ్యవసాయ రంగానికి అవసరమైన పనిముట్లు, మసాలా దినుసులు, కోళ్లు, మేకలు, ఎండుచేపలు, దుస్తులు, కుండలతోపాటు మిగిలిన సామగ్రికి డిమాండ్ వుంటుంది. ఈ నెల 16, 17 తేదీల్లో చుట్టుపక్కల గ్రామాల్లో అమ్మవారికి పసుపు – కుంకుమ సమర్పించేందుకు భక్తులు తరలివస్తే వ్యాపారం జోరుగా సాగాలి. అయితే ఎండ వేడిమి కారణంగా సంత బోసిపోయింది. అసలు ఆదివారం సంత ఉందా..? లేదా..? అన్న అనుమానం కలిగేలా ఈ చుట్టుపక్కల ప్రాంతాలు ఖాళీగా దర్శనమిచ్చాయి.

పుస్తక పఠనంపై పరిశీలన


సంతపేటలో ఓ విద్యార్థి ఇంటి వద్ద ఉపాధ్యాయులు

తగరపువలస: ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశపెట్టిన టీచింగ్ ఎట్ ది రైట్ లెవెల్ (తరల్) కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల్లో పఠనాసక్తి పెంపొందించడానికి సెలవుల్లో కథల పుస్తకాలు ఇంటికి ఇచ్చి చదివిస్తున్నారు. ఇందులో భాగంగా 'వేసవిలో సరదాగా' పేరుతో ఇటీవల సెలవులకు ముందు విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. అందులో భాగంగా ఆదివారం జీవీఎంసీ ఒకటో వార్డు అంబేడ్కర్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మొకర పద్మావతి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు పలువురు విద్యార్థుల ఇళ్లను సందర్శించి ఎలా చదువుతున్నారో పరిశీలించారు. జగనన్న బడిబాటలో భాగంగా నూతనంగా పాఠశాలలో చేరబోయే విద్యార్థుల జాబితా సేకరించారు. ఆమెతోపాటు ఉపాధ్యాయులు జి.దుర్గాప్రసాద్, డి.రమేష్, లీలామణి పాల్గొన్నారు.

బంగ్లామెట్టలో 15 అడ్మిషన్లు

బంగ్లామెట్ట జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆర్.అప్పలరాజు ఆధ్వర్యంలో జగనన్న బడిబాట కార్యక్రమంలో భాగంగా వెంపాడవారి అంగన్‌వాడీ కేంద్రం నుంచి ఆరుగురు, రామన్నపేట కేంద్రం నుంచి ఇద్దరిని కలుపుకుని 1 నుంచి 5వ తరగతి వరకు 18 అడ్మిషన్లు పూర్తి చేశారు. ఇంకా బడికి వెళ్లే విద్యార్థుల కోసం ఇంటింటా సర్వే చేస్తున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మల్లిక, నాగమణి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మాతృదినోత్సవం

తగరపువలస: భీమిలి ఆదర్శప్రేమీ మండలి ఆధ్వర్యంలో ఆదివారం మాతృదినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గౌరవ అధ్యక్షుడు గంటా నూకరాజు, అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.కృష్ణారావు మాట్లాడుతూ బిడ్డ పుట్టక ముందు నుంచి పుట్టిన తర్వాత ఎంత ఎత్తుకు ఎదిగినా వారిని ప్రేమించే ఏకైక వ్యక్తి తల్లి మాత్రమే అన్నారు. అలాంటి తల్లిదండ్రులను వృద్ధులు అయిన తర్వాత నిర్దాక్షిణ్యంగా వదలివేయడం తగదన్నారు. ఈ సందర్భంగా హిందీ విద్యార్థులచే తల్లులకు పాద నమస్కారాలు చేయించారు.

పైడితల్లమ్మకు జలాభిషేకం

పద్మనాభం: మండలంలోని కృష్ణాపురంలో ఆదివారం పైడితల్లమ్మకు జలాభిషేకం నిర్వహించారు. ఈ నెల 15 నుంచి 17 వరకు నిర్వహించనున్న పైడితల్లమ్మ ఉత్సవాల్లో భాగంగా ముందస్తుగా జలాభిషేకం చేశారు. మహిళలు కలశాలతో నీళ్లు పట్టుకుని ఊరేగింపుగా ఆలయం వద్దకు వెళ్లి అమ్మవారికి జలాభిషేకం చేశారు.



తీరంలో సండే సందడి

కొమ్మాది: ఓ వైపు మండే సూర్యుడు... మరోవైపు వేసవి సెలవులు... ఫలితంగా పర్యాటక ప్రాంతాలు ఆదివారం కిటకిటలాడాయి. భీమిలి, రుషికొండ, సాగర్‌నగర్ తీర ప్రాంతాలతోపాటు రామానాయుడు ఫిల్మ్ స్టూడియో, తొట్లకొండ, బావికొండ ప్రాంతాల్లో పర్యాటకుల తాకిడి పెరిగింది. సాయంత్రం వరకు బీచ్‌లో ఎండ తాపం నుంచి సేద తీరేందుకు పెద్దలు, చిన్నారులు స్నానం చేస్తూ గడిపారు.

క్లుప్తంగా

ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

కొమ్మాది: సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం వారాంతపు పూజల్లో భాగంగా హరే కృష్ణ, హరేరామ నామస్మరణతో ప్రత్యేక పూజలు చేశారు. రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర, జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహస్వామి విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామివారి లీలలు, మహిమలు వర్ణిస్తూ భక్తులు భజనలు, గీతాలాపన చేశారు.

విద్యార్థులకు క్రమశిక్షణ అవసరం

తగరపువలస: ఆనందపురం శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా 'విద్యార్థులు – క్రమశిక్షణ' అనే అంశంపై ఆదివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మండల ప్రజాసంక్షేమ సంఘం అధ్యక్షుడు మీసాల అప్పలనాయుడు ఆధ్వర్యంలో కథలు చెప్పి, రాయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రోజూ తల దించుకుని మనం పుస్తకం చదివితే, భవిష్యత్‌లో మనం తల ఎత్తుకునేలా చేస్తుందన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని సూచించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి బీవీఎస్ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

17న 'ఆకెళ్ల' సంతాపసభ



తగరపువలస: చిట్టివలస జ్యూట్‌మిల్లు రామాలయం ఆవరణలో గురుస్వామి ఆకెళ్ల నరసింహమూర్తి సంతాపసభను ఆయన శిష్యబృందం ఈ నెల 17న నిర్వహించనున్నారు. చిట్టివలసలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో పలువురు శిష్యులు మాట్లాడుతూ అయ్యప్పస్వామి సేవలో ఆకెళ్ల చేసిన సేవలకు గుర్తుగా ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. సంతాపసభ సందర్భంగా ఉత్తరాంధ్ర నుంచి వేలాది మంది శిష్యులు, సాధువులను ఆహ్వానించామన్నారు. సభ అనంతరం సుమారు మూడు వేల మందికి అన్నప్రసాదం పంపిణీ చేయనున్నట్టు తెలిపారు.

ఘనంగా ఆలయ సంప్రోక్షణ


ఇత్తడి తాపడంతో ధ్వజస్తంభం

పద్మనాభం: మండలంలోని పాండ్రంగిలో వేణుగోపాలస్వామి ఆలయంలో ధ్వజస్తంభ సంప్రోక్షణ ఆదివారం ఘనంగా నిర్వహించారు. విశేష పూజల అనంతరం ధ్వజస్తంభానికి ఇత్తడి తాపడం తొడిగారు. ఈ సందర్భంగా భక్తులు వేణుగోపాల స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకుడు రామాచార్యులు, ఈవో నానాజీ బాబు, ఆలయ కమిటీ చైర్మన్ రాజసాగి హరీష్ కుమార్ వర్మ, అప్పలనరసయ్య, ఎస్.సన్యాసిరాజు, ఆర్.ఎస్.దేముడుబాబు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

తగరపువలస: స్థానిక జాతీయ రహదారిపై ఆదివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో నగరంలోని కంచరపాలేనికి చెందిన తణుకుల వెంకటలక్ష్మి గాయపడింది. అనకాపల్లి జిల్లా వి.మాడుగులకు చెందిన టాటా ఏస్ వాహనం శ్రీకాకుళం జిల్లా అరసవిల్లి వెళ్తూ రోడ్డు దాటుతున్న వెంకటలక్ష్మిని ఢీకొంది. సంగివలస వద్ద పెళ్లి కోసమని వచ్చిన ఆమె సాయిరాం పార్లర్ వద్ద రోడ్డు దాటుతుండగా ఈ ప్రమాదానికి గురైంది. భీమిలి ట్రాఫిక్ పోలీసులు చికిత్స కోసం ఆమెను ఆస్పత్రికి తరలించారు.

జై భజరంగ భళీ


చిట్టివలస జ్యూట్‌మిల్లు రామాలయం ఆవరణలోని పంచముఖ ఆంజనేయస్వామి


ప్రత్యేక అలంకరణలో దాసాంజయనేయ స్వామి


మధురవాడలో స్వామికి పూజలు చేస్తున్న అర్చకులు


జీరుపేట వీరాంజనేయస్వామి ఆలయంలో భక్తుల పూజలు


పద్మనాభంలో బైక్‌లతో శోభాయాత్ర నిర్వహిస్తున్న హనుమాన్ భక్తులు

ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు

తగరపువలస: హనుమాన్ జయంతి వేడుకలు భీమిలి అర్బన్, రూరల్ పరిధిలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్వామికి భక్తులు మామిడిపండ్లు, అరటి, కొబ్బరికాయలు, వడలు, పనసలు, పులిహోర, మజ్జిగ, కొమ్ముశనగలు, బూందీ ప్రసాదాలుగా సమర్పించి గంధ, సింధూరాలు, తమలపాకులతో అర్చనలు చేశారు. భీమిలి రోడ్డులోని జీరుపేటలో శ్రీవీరాంజనేయస్వామి ఆలయానికి అదే గ్రామానికి చెందిన జీరు శ్రీనివాసరెడ్డి, పద్మ దంపతులు రూ.25 వేల విలువైన కంచు మకర తోరణాన్ని బహూకరించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ప్రతినిధులు దల్లి అప్పలరెడ్డి, సరగడ శివాంజనేయరెడ్డి తదితరులు భజన నిర్వహించారు. మరడపాలెంలోని ఆంజనేయస్వామి ఆలయ ప్రతినిధులు భీమిలి రోడ్డులో ప్రయాణికులకు మజ్జిగ, పులిహోర పంపిణీ చేశారు. చిట్టివలస జ్యూట్‌మిల్లు రామాలయం ఆవరణలోని 35 అడుగుల అంజనేయస్వామి విగ్రహానికి జోగారావు శర్మ, మల్లిబాబు ఆధ్వర్యంలో గంధ, సింధూరాలతో అర్చనలు చేశారు. తగరపువలస కూడలిలోని శ్రీ అభయ ఆంజనేయస్వామి ఆలయం వద్ద బీజేపీ 1, 2 వార్డుల అధ్యక్షురాలు శీరపు రామలక్ష్మి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పంపాన శ్రీధర్, జీరు సురేష్‌రెడ్డి, పంపాన సుబ్రహ్మణ్యం, శీరపు వెంకటరెడ్డి, అయినాడ మాధవ్, ధరణి, రాంబాబు, భార్గవ్ తదితరులు పాల్గొన్నారు. భీమిలి మండలం గొల్లల తాళ్లవలస, మజ్జివలస, తాటితూరు కూడలి, అన్నవరం చిట్టివలస ఈఎస్ఐ ఆస్పత్రి కూడలి వద్ద ఆంజనేయస్వామి ఆలయాల్లో ఆయా కమిటీల ప్రతినిధులు ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రసాదాలు పంపిణీ చేశారు.

భీమునిపట్నం: స్థానిక దాసాంజనేయ స్వామి దేవాలయంలో ఆదివారం అర్చకులు వంశీమోహన చెన్నకృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో 108 కొబ్బరికాయల నీటితో అభిషేకంతోపాటు పంచామృత, ఫలరస, సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పద్మనాభం: మండలంలోని మద్ది, పద్మనాభం, రేవిడి జంక్షన్‌లో, కృష్ణాపురం, రెడ్డిపల్లి, కోరాడ, అనంతవరం, తునివలస, విలాస్కాన్‌పాలెం గ్రామాల్లో హనుమాన్ జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. మద్ది జంక్షన్‌లోని ఆలయాన్ని ఎంపీపీ కంటుబోతు రాంబాబు, సుంకర నారాయణరావు, కంటుబోతు పైడిరాజు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. రెడ్డిపల్లి కృష్ణ చంద్రబాబాజీ మఠం ఆవరణలో అన్నదానం ఏర్పాటు చేశారు.

బైక్‌లతో హనుమాన్ శోభాయాత్ర

పద్మనాభం: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం హనుమాన్ భక్తులు బైక్‌లతో శోభాయాత్ర నిర్వహించారు. సుమారు వంద బైక్‌లతో భక్తులు రెడ్డిపల్లి కృష్ణ చంద్ర బాబాజీ మఠం ఆవరణలో ఉన్న హనుమాన్ ఆలయం నుంచి యాత్ర ప్రారంభించారు. రెడ్డిపల్లితోపాటు పద్మనాభం, మద్ది, కురపల్లి, రేవిడి గ్రామాల్లో కొనసాగించారు. యాత్రలో ఎంపీపీ కంటుబోతు రాంబాబు పాల్గొన్నారు.

కొమ్మాది: స్థానిక అన్నంరాజునగర్‌లోని శ్రీ అష్టలక్ష్మి ఆలయంలో క్షేత్ర పాలకుడైన శ్రీ అభయాంజనేయ స్వామికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. స్వామిని ప్రత్యేకంగా అలంకరించి తమలపాకులతో సహస్రనామార్చన, సింధూరంతో అర్చన నిర్వహించినట్లు ప్రధాన అర్చకులు చామర్తి శ్రీధరస్వామి తెలిపారు.

- భీమిలి బీచ్ రోడ్డు మంగమారిపేట హంసవన పుణ్యక్షేత్రం రామాద్రిలో ఆదివారం శ్రీ హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం 6 గంటల నుంచి పంచామృతాభిషేకాలు, సహస్ర సింధూర, తమలపాకుల పూజ, నీరాజనం, మంత్రపుష్పం నిర్వహించారు. సాయంత్రం హనుమాన్ చాలీసా పారాయణ, అనంతరం రథోత్సవం నిర్వహించారు. మారికవలస, కాపులుప్పాడ, సోమన్నపాలెం, చేపలుప్పాడ, ఎండాడ, రుషికొండ ప్రాంతాల్లో గల ఆంజనేయస్వామి ఆలయాల్లో హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

మధురవాడ: జాతర గట్టు దుర్గాలమ్మ ఆలయ ప్రాంగణం, మధురవాడ సిద్ధేశ్వర పీఠంలోని పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయం, మానం ఆంజనేయులు నగర్‌లోని లలితా త్రిపుర సుందరి సమేత మహా కామేశ్వర స్వామి ఆలయ ప్రాంగణం, బొట్టవానిపాలెం, మారికవలస ఆర్‌జీకే గృహకల్ప కాలనీలో స్వామికి నూతన వస్త్రాలు సమర్పించి, పంచామృత, సుగంధ, సింధూర అభిషేకాలు చేశారు. పరిసర ప్రాంతాల భక్తులు విశేషంగా పూజలు నిర్వహించారు.

తగరపువలస: ఆనందపురం మండలం గుడిలోవ విజ్ఞాన్ విహార అభయ ఆంజనేయస్వామి ఆలయ ఆవరణలో ఆదివారం హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామికి పంచామృతాలు, తమలపాకులతో పూజలు చేశారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్య కమిటీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. ప్రసాద పంపిణీ, భజనతో ఉత్సవాలు ముగిశాయి.


మధురవాడలో హనుమాన్ రక్షా హోమం


అష్టలక్ష్మి ఆలయంలో అలంకరణలో ఆంజనేయస్వామి


రామాద్రిలో హనుమాన్‌కు అభిషేకం


హనుమాన్ ఆలయంలో పూజలు చేస్తున్న ఎంపీపీ రాంబాబు, తదితరులు

కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయ ప్రారంభానికి ఏర్పాట్లు

మధురవాడ: జీవీఎంసీ 5వ వార్డు కొమ్మాది కూడలి సమీపంలోని వికలాంగుల కాలనీలో నిర్మించిన శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయం ప్రారంభానికి ఏర్పాట్లు చేస్తున్నట్టు శిరిడీ సాయిబాబా ఆలయ వ్యవస్థాపకుడు పీవీ రమణమూర్తి, కాలనీ ప్రెసిడెంట్ సూరిబాబు చెప్పారు. ఈ సందర్భంగా ప్రతిష్ఠాపన పనులు ఆదివారం ప్రారంభించారు. గత 12 ఏళ్లుగా దాతల సహకారంతో చేపట్టిన నిర్మాణ పనులు పూర్తి కావచ్చాయన్నారు. ఇంకా దేవతామూర్తుల విగ్రహాలు, మకర తోరణం, హుండీ, గ్రిల్స్ ఏర్పాటు, పెయింటింగ్ పనులు జరుగుతున్నాయని చెప్పారు. జూన్ 12న ఆలయంలో విగ్రహాల ప్రతిష్ఠాపనకు సిద్ధం చేస్తున్నట్టు చెప్పారు. తుది దశ పనుల్లో భాగస్వాములు కావాలనుకునే వారు సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో కార్యదర్శి ఎస్.నర్సింగరావు, ట్రెజరర్ యు.లక్ష్మి, శిల్పి స్వామి, సూర్యప్రసాద్, ముత్తమ్మ, మోహన్‌కృష్ణ, వసంత కుమారి తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు


నృత్య ప్రదర్శనలో కళాకారులు

పీఎం పాలెం: మధురవాడ శిల్పారామంలో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. సింహాచలం సరస్వతీ నృత్య కళామందిరానికి చెందిన కె.బాల సరస్వతి నృత్య దర్శకత్వంలో కళాకారులు శాస్త్రీయ, జానపద నృత్యాలు ప్రదర్శించారు. నేహ, లాస్య, లక్ష్మీ ప్రణతి, లావణ్య, బిందు, హరిణి, వైష్ణవి, భావన, రోషిణి, తేజ, దీక్షకృష్ణ, గీతిక, కుందన, చిద్విలాసిని తదితరులు అభినయంతో చేసిన నృత్యాలు చూపరులను ఆకట్టుకున్నాయి.

బడిఈడు పిల్లలంతా స్కూల్‌లో చేరాలి

మధురవాడ: బడిఈడు పిల్లలు అందరూ ప్రభుత్వ పాఠశాలల్లో చేరాలని వాంబేకాలనీ సునీల్‌శర్మ కాలనీలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సన్యాసిరావు కోరారు. వాంబేకాలనీలో ఆదివారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన, ఇతర ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి బడిఈడు పిల్లలున్న ఇళ్లకు వెళ్లి చదువు ఆవశ్యకత, ప్రభుత్వ పాఠశాలల్లో అందుతున్న పథకాలు, సౌకర్యాలు వివరించారు. కాలనీ వీధుల్లో ప్లకార్డులు పట్టుకుని ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సీహెచ్.రామచంద్రరావు, ఎ.సత్యవతి, కె.త్రిమూర్తులు, ఎడ్యుకేషన్ సెక్రటరీ ప్రవీణ్ పాల్గొన్నారు.


వాంబేకాలనీలో బడిబాట ర్యాలీలో విద్యార్థులు

ప్రధాని మోదీ, బీజేపీ నాయకులపై ఫిర్యాదు


సీఐ సన్యాసినాయుడుకు ఫిర్యాదు అందిస్తున్న రాంబాబు, గిరిబాబు, తదితరులు

పద్మనాభం: అధికారంలోకి వస్తే ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇస్తామని చెప్పి మోసగించిన బీజేపీ నాయకులు, ప్రధాని నరేంద్ర మోదీపై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ సీపీ నాయకులు, ఎంపీపీ కంటుబోతు రాంబాబు, జెడ్పీటీసీ సభ్యుడు సుంకర గిరిబాబు ఆదివారం పద్మనాభం సీఐ ఎస్.సన్యాసినాయుడుకు ఫిర్యాదు చేశారు. అధికారంలోకి వస్తే పదేళ్లు ప్రత్యేక హోదా ఇస్తామని ఉద్దేశపూర్వకంగా తప్పుడు హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత నెరవేర్చకుండా ప్రజలను మోసం చేశారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. బీజేపీని అధికారంలోకి తెస్తే స్విస్ బ్యాంకులో కొందరు అక్రమంగా దాచిన నల్లధనాన్ని బయటకు తెచ్చి పేద ప్రజల ఖాతాల్లో జమ చేసి పేదరికాన్ని నిర్మూలిస్తామని ఇచ్చిన హామీ కూడా నెరవేర్చే ప్రయత్నాలు జరగలేదని తెలిపారు. బీజేపీ భీమునిపట్నం నియోజకవర్గం కో ఆర్డినేటర్ కె.రామానాయుడు గతంలో ఆంధ్రా చైతన్య పార్టీ ద్వారా ప్రజలకు సేవ చేస్తానని కల్లబొల్లి మాటలు చెప్పి, ఆ పార్టీని బీజేపీకి తాకట్టు పెట్టి ఉద్దేశపూర్వకంగా మోసం చేశారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. వీరందరిపై కేసు నమోదు చేయాలని కోరారు.